క్లుప్తంగా

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో వేంచేసియున్న శ్రీభావనారాయణస్వామి, ఆంజనేయ, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, నాగేంద్ర స్వామి, విమానశిఖర, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి, వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాల నేపథ్యంలో భారీగా తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామంలోని ప్రతి ఇల్లు సందడిగా మారింది. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందినవారు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఈ ప్రతిష్ఠా మహోత్సవాల్లో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభాకరరావుకు ఘననివాళి



నందిగామరూరల్: నందిగామ మాజీఎమ్మెల్యే తంగిరాల ప్రభాకరరావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తంగిరాల ఘాట్‌లోని ప్రభాకరరావు సమాధిని ఆయన కుమార్తె, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సౌమ్య మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభాకరరావు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పార్టీ నాయకులు కృపారావు, శ్రీనివాసాచారి, రాము, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై రేపు సమీక్ష

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై శనివారం సాయంత్రం నాలుగుగంటలకు అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ సురేష్‌బాబు గురువారం తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఈఓ కోరారు.

కంచికచర్ల ఫైర్ అధికారిగా శివారెడ్డి



కంచికచర్ల: కంచికచర్ల అగ్నిమాపక కేంద్ర అధికారిగా ఎ.శివారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. కంచికచర్ల ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్‌గా తలశిల శ్రీనివాసరావు పనిచేస్తుండగా, శివారెడ్డి గన్నవరంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునేందుకు అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాల సమయంలో వెంటనే ఫైర్ సిబ్బంది లేదా పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

వెంకటేశ్వరునికి గరుడ సేవ



నందిగామ రూరల్: పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. రాత్రికి పలురకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై స్వామి, అమ్మవారిని ఉంచి ఊరేగించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, బండారు కేదార్‌నాథ్, ఫులిపాటి శ్రీనివాసరావు, కొప్పు రామారావు, కొంగర దుర్గాప్రసాద్ తగిన ఏర్పాట్లు చేశారు.

వడదెబ్బ నివారణ మందుల పంపిణీ

నందిగామటౌన్: స్థానిక గాంధీ సెంటరులో గురువారం భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణకు హోమియో మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరై హోమియో మందులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా వడదెబ్బ నివారణ మందులు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు బచ్చుల సుబ్రహ్మణ్యం, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన అరుణపతాకం

ఘనంగా మే డే వేడుకలు



కంచికచర్లలో మే డే ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



చిల్లకల్లులో జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘ నాయకులు, కార్మికులు

నందిగామటౌన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మే డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అరుణపతాకాలను ఆవిష్కరించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

నందిగామ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో కార్మికుల పక్షపాతిగా కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు అవస్థలుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, కంచికచర్ల ఎంపీపీ మలక్ బషీర్, నాయకులు షేక్ యాకుబ్‌అలీ, షేక్ మీరా, తోట అంజారావు, పోతురాజు, బుడ్డి సత్యనారాయణ, చాగంటి రవికిరణ్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతబస్టాండ్ సెంటర్‌లో..

నందిగామ రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఎందరో మహానుభావులు చేసిన పోరాట ఫలితంగా కార్మిక లోకంలో చైతన్యం వెల్లివిరిసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన కూడళ్లలోని కార్మిక జెండాలను కార్మిక సంఘాల నాయకులు ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ రమణబాబు జెండాను ఆవిష్కరించి సీఐటియు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ, శీతల పానియాలను పంపిణీ చేశారు. రైతుపేట ఆటోస్టాండ్ వద్ద టీడీపీ నాయకుడు మండవ పిచ్చయ్య, పంగా సతీష్ కార్మిక జెండాను ఆవిష్కరించి చలివేంద్రాన్ని పంపిణీ చేశారు. బైపాస్ రోడ్డులో ముఠా వర్కర్స్ సీనియర్ నాయకుడు కత్రి వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. తిరుమలగిరి గ్యాస్ ఏజెన్సీస్, 18వ వార్డు ఎన్‌ఎస్పీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మే డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కటారపు గోపాల్, చనుమోలు సైదులు, సయ్యద్ ఖాశీం, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో కార్మికనాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. మే డే వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న సీపీఐ, జగ్గయ్యపేట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకల్లో ఎమ్మెల్యే తాతయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు దేశంలోనే ఒక బలమైన శక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నీలకంఠం శివప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం మే డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టియూ జిల్లా కమిటీ సభ్యులు మరిపూడి చిన్నా మాట్లాడుతూ వేలాదిమంది కార్మికుల ప్రాణాల త్యాగఫలితమే మే డే అని పేర్కొన్నారు.కార్మికులకు పనికి తగిన వేతనం అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ యూనియన్ నాయకులు జి.హరికృష్ణారెడ్డి, తాటికొండ వీరయ్య సయ్యద్ చినఖాసీం, ఉప్పుతల వెంకయ్య, ఉప్పుతల శ్రీను, చింతగుంట కోటేశ్వరరావు, బత్తుల అయ్యప్ప, కాకుమాను రామారావు, జీనేపల్లి స్వామి, భూషణం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ వద్ద...

స్థానిక రాజ్యలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు.

సీఐటీయూ నాయకుడు ఎం.సోమేశ్వరరావు అరుణపతాకాన్ని ఎగురవేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, జుజ్జూరు రోడ్డు సెంటర్, గొట్టుముక్కల రోడ్డు సెంటర్లలో కార్మికులు అరుణపతాకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా మండలంలోని పరిటాల, కీసర, గండేపల్లి, చెవిటికల్లు, కొత్తపేట, మోగులూరు తదితర గ్రామాల్లో కార్మికులు మే డే వేడుకలు జరుపుకున్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయితో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలోని పీహెచ్‌సీ వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జి.నాగేశ్వరి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని ప్రభుతాన్ని కోరారు. ఆటో, హమాలీ, లారీ, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి. రాము, రైతు సంఘ జిల్లా నాయకులు మండేపుడి చంద్రశేఖర్, కౌలురైతు సంఘ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

స్థానిక సీపీఎం కార్యాలయం, అమ్మవారి ఆలయం, పీహెచ్‌సీల వద్ద మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరుణపతాకాన్ని ఎగురవేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ బ్రిటీష్‌కాలంలో పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వి. గురవయ్య, గజ్జి పెద్దిరాజు, ధనమ్మ, దారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మే డే సందర్భంగా చిల్లకల్లులో గురువారం భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు యాదగిరి, ఏడుకొండలు, ఈశ్వరరావు, ఖాజా, మధు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేటఅర్బన్: మే డే వేడుకలను కార్మికులు గురువారం జగ్గయ్యపేట పట్టణంలో వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసి, సీఐటీయూ డివిజన్ కమిటీ, మండల కమిటీల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

మేడే వేడుకల్లో భాగంగా పట్టణంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని న్యాయవాది కాసరగడ్డ నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, సీపీఎం నాయకులు కోట కృష్ణ, జె.వెంకట్రావు, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన వెంకటేశ్వర్లు, దంతాల నరేంద్ర, షేక్ గౌస్మియా, దాశరథి భాస్కర్, ఎలకమ్మ, పద్మ, నరసింహారావు, బాషా, సెల్వరాజ్ బిల్డింగ్ వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మున్సిపల్, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ..

జగ్గయ్యపేటలో ప్రధాన వీధుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, కార్పెంటర్, సెంట్రింగ్, పెయింటింగ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ, ఆయా సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయాచోట్ల జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ నియోజక కార్యదర్శి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్, మహ్మద్ అసతుల్లా, ఏఐటీయూసీ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, బొగ్గం నాగులు, మెటికల శ్రీనివాస్,ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు పరుచూరి రాజేంద్ర, లంక గోవింద రాజులు, కరిసె మధు, మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కమ్యూనిస్టు పార్టీలు పోరాడుతున్నాయని సీపీఐ రాష్ట్ర నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరుణపతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీలకు వేలాది ఎకరాలు ధారాదత్తం చేస్తున్నప్పటికీ నిరుపేదకు రెండు సెంట్ల స్థలం ఇవ్వలేకపోతున్నాయని మండిపడ్డారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట కళ్యాణ్, వట్టికొండ పార్థసారధి, చాట్ల రవి, లాల్ అహ్మద్‌గౌస్, మంగలపూడి సుందర్‌రావు, మంగలపల్లి సత్యానందం, షేక్ సుభాని, శాభాసి పాల్గొన్నారు.

జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్(వైఎస్సార్ టీయూసీ) ఆధ్వర్యంలో మే డే వేడుకలు గురువారం ఆపార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు, కర్షకులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల శ్రమ, అంకితభావం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని కొనియాడారు. వారి సేవలకు సమాజం ఎల్లప్పుడు రుణపడి ఉంటుందన్నారు. కార్మిక సంక్షేమం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపాలనలో ఎన్నో పథకాలు అందించడంతోపాటు అనేక కార్యక్రమాలను అమలుచేశారని గుర్తుచేశారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు,, కార్మికులు పాల్గొన్నారు.



నందిగామలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



పాతబస్టాండ్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



పేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య, పక్కన దోనేపూడి శంకర్, నాయకులు



నందిగామలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్



వత్సవాయిలో మే డే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు



పెనుగంచిప్రోలు జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కార్మిక నాయకులు, ఆశ కార్యకర్తలు

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛన్లు పంపిణీ చేస్తున్న పీడీ శ్రీలక్ష్మి



గండేపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచి రవికుమార్

నందిగామరూరల్: సచివాలయ సిబ్బంది పింఛన్‌దారులకు సకాలంలో పింఛన్‌ను పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి సూచించారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో నిర్వహిస్తున్న పింఛన్‌ల పంపిణీని గురువారం ఆమె ప్రారంభించి, పర్యవేక్షించారు. పీడీ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని గండేపల్లి, కీసర, పేరకలపాడు, కంచికచర్ల గ్రామాల్లోని పింఛన్‌దారులకు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ, పేరకలపాడు, గండేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. మస్టర్లు జాగ్రత్తగా వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, డిజిటల్ అసిస్టెంట్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

కోదండరామయ్యకు ఘన నివాళి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వీరులపాడు: ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించిన గొప్పవ్యక్తి చావా కోదండరామయ్య అని పలువురు నాయకులు కొనియాడారు. వీరులపాడులో గురువారం కోదండరామయ్య సంస్మరణ సభను ఆయన కుమార్తె, సినీనిర్మాత, విజయవాడ కార్పొరేటర్ చావా సుధారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కోదండరామయ్య ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. అనంతరం మే డే సందర్భంగా చావా సాంబయ్య రచించిన శ్రమశక్తి, విజ్ఞాన వెలుగులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంధాలయాధికారి కమలమ్మ, ఎక్సైజ్ శాఖ మాజీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాటిబండ్ల జయపాల్, మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్, నాయకులు వట్టికొండ పార్థసారధి, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు డ్రాయింగ్ శిక్షణ



తాము వేసిన డ్రాయింగ్‌లతో విద్యార్థులు

కంచికచర్ల: గ్రంథాలయంలో నిర్వహించే విజ్ఞాన శిబిరాలను విద్యార్థులంతా తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం డ్రాయింగ్ శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో కవి నీలం సర్వేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఘన సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షునిగా నియమితులైన దర్శి వెంకటేశ్వరరావును ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని తన్నీరు ఆయనకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిరాలకు బిరుదు ప్రదానం

విజయవాడకల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ సంగీత విభావరి, సీనియర్ గాయకుడు, హిందూస్థానీ సంగీత విద్వాంసుడు ఆదిరాల జయప్రభు పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు ఆదిరాల జయప్రభు 35 సంవత్సరాల పాటు నగర పాలక సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారని తెలిపారు. నిర్వాహకులు ఆదిరాల జయప్రభును లలిత కళాగాన కోకిల బిరుదుతో సత్కరించారు. పరుచూరి విజయలక్ష్మి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పురావస్తు పరిశోధకుల సందర్శన



ధనంబోడు బౌద్ధక్షేత్రాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ధనంబోడుపై ఉన్న బౌద్ధం స్థూపం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ధనంబోడుపై ఉన్న బౌద్ధస్థూపం, ఆరామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వేల ఏళ్ల నాటి బౌద్ధక్షేత్రానికి రవాణా, పర్యాటక సదుపాయాలు కల్పించడానికి తగు ప్రణాళికలను సిద్ధం చేయడంలో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర పర్యాటక, కేంద్ర పురావస్తుశాఖ, జగ్గయ్యపేట పురపాలక సంఘంతో కలిసి తగు ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఆయన వెంట పురావస్తుశాఖ ప్రతినిధులు మీసాల బాలాజీరావు, సుంకర సాంబశివరావు, వెంకటరెడ్డి ఉన్నారు.

విశ్వస్ఫూర్తి బోధనలు పాటించాలి



ప్రతాప్‌ను సన్మానిస్తున్న గురుభక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి 85వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతివ్యక్తికి తన పుట్టినరోజు నుండే కొత్త సంవత్సరం మొదలవుతుందనే విషయాన్ని గ్రహించి, వారి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవితాన్ని సఫలం చేసుకోవాలన్న గురుదేవుల సూచనలను అందరూ పాటించాలన్నారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిత్యం ప్రాణాయామం, యోగా సనాలు వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ గురుదేవులు రచించిన గ్రంథాలు, వాటి విశిష్టతను వివరించారు. పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ గురుదేవులతో తమకున్న అనుబంధాలను నెమరవేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సీనియర్ యోగా ఇన్‌స్ట్రక్టర్ ప్రతాప్ రచించిన యోగా స్ఫూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించి, ఆయనను ఘనంగా సత్కరించారు.

సీహెచ్‌ఓల నిరసన ప్రదర్శన



నిరసన ప్రదర్శన చేస్తున్న సీహెచ్‌ఓలు

కంచికచర్ల: ప్రభుత్వ నిబంధనల మేరకు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌ఓలు) గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.